www.nagaranijam.com PRGI/RNI NO : APTEL/2013/54450

# నగరనిజం

www.nagaranijam.com అక్షరనిజం నగరనిజం తెలుగు దిన పత్రిక



నగరనిజం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు విలేకరులు కావలెను ఆసక్తి ఉన్నవారు ఈ క్రింది నెంబర్ ఫోన్‌కి చేయగలరు :
☎ 82474 67562
Email Id : nagaranijam@gmail.com





| సంపుటి : 14 | సంచిక : 68 | ఉమ్మడి రంగారెడ్డి | సంపాదకులు : ఏలె. పురుషోత్తం | 31,ఆదివారం,మే 2026 | పేజీలు : 4+ | ₹ 3 |
|---|---|---|---|---|---|---|
| Volume : 14 | Issue : 68 | Rangareddy | Editor : Aela Purushotham | 31,Sunday,May,2026 | Pages : 4+ | Price : 3/- |

Published From Rangareddy, Circulated by Hyderabad, Nalgonda, Khammam, Karimnagar, Warangal, Mahaboobnagar, Medak, Nizamabad, Adilabad


## విద్యార్థులపై పెట్టుబడి...

# భవిష్యత్ తెలంగాణపై పెట్టుబడే

హైదరాబాద్, 30 మే (నగర నిజం) :దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల విద్యాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. విద్యను ఖర్చుగా కాకుండా భవిష్యత్ తరాలపై చేసే అత్యంత విలువైన పెట్టుబడిగా ప్రభుత్వం భావిస్తోందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన "అకాడమిక్ సక్సెస్ మీట్--2026" మరియు "జనజాతీయ గరిమ ఉత్సవ్ -- బిర్సా లివ్స్ ఇన్ న్యూ భారత్" కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం గిరిజన విద్యార్థుల ఆత్మవిశ్వాసం, ప్రతిభ, సాధికారతకు ప్రతీకగా నిలుస్తోందన్నారు. బిర్సా ముండా, కొమురం భీం, రాంజీ గోండ్ వంటి మహనీయుల పోరాట స్ఫూర్తి యువతకు మార్గదర్శకమని వివరించారు. తెలంగాణలో సామాజిక న్యాయం కేవలం నినాదం కాదని, విద్య ద్వారానే బడుగు వర్గాలకు సాధికారత సాధ్యమవుతుందని మంత్రి స్పష్టం చేశారు. ప్రతి పేద విద్యార్థి ప్రపంచ స్థాయి అవకాశాలు అందుకునేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. ఒక విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగం సాధిస్తే ఒక కుటుంబం మాత్రమే కాదు, ఒక తరం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. తెలంగాణ గిరిజన గురుకులాలు దేశవ్యాప్తంగా ఆదర్శ విద్యాసంస్థలుగా నిలుస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం 82 వేల మందికి పైగా విద్యార్థులకు నాణ్యమైన ఉచిత నివాస విద్య అందిస్తున్నట్లు తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో ఎస్ఎస్‌సీ ఫలితాల్లో 98.86 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, 56 విద్యాసంస్థలు వంద శాతం ఫలితాలు సాధించాయని వెల్లడించారు. ఇంటర్మీడియట్‌లో 86.53 శాతం ఉత్తీర్ణత నమోదైందన్నారు. జేఈఈ, నీట్, ఈఏపీసెట్ వంటి జాతీయ




స్థాయి పరీక్షల్లో గిరిజన విద్యార్థులు విశేష ప్రతిభ కనబరుస్తున్నారని చెప్పారు. ధర్మపురిలో గిరిజన బాలికల కోసం ఆరో తరగతి నుంచి డిగ్రీ వరకు సమగ్ర విద్య అందించే సైనిక్ స్కూల్, డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు మంత్రి వెల్లడించారు. త్వరలోనే ఆమోదం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గిరిజన సంక్షేమ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న 1,185 మంది పార్ట్‌టైం ఉద్యోగుల గౌరవ వేతనాల పెంపునకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. అలాగే ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్స్, డిప్యూటీ వార్డెన్లు, వైస్ ప్రిన్సిపాల్స్‌కు ప్రత్యేక భత్యాలు పెంచినట్లు వివరించారు. గురుకులాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి రూ.72.83 కోట్లతో మరమ్మతులు, నిర్వహణ పనులకు అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆధునిక మాడ్యులర్ కిచెన్ల ఏర్పాటుకు రూ.25 కోట్లు కేటాయించామని వెల్లడించారు. విద్యార్థుల్లో పరిశోధన, ఆవిష్కరణలకు ప్రోత్సాహం కల్పించేందుకు ప్రముఖ జాతీయ సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నామని మంత్రి తెలిపారు. సీఎస్ఐఆర్--ఐఐసీటీతో కలిసి రీసెర్చ్, ట్రైనింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. "అనీమియా ముక్త్ భారత్" కార్యక్రమాన్ని గాంధీ మెడికల్ కాలేజ్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ భాగస్వామ్యంతో అమలు చేస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐఐటీ జేఈఈ, నీట్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మంత్రులు మెమెంటోలు, నగదు పురస్కారాలు అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి సీతక్క, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యేలు నవీన్ యాదవ్, వెడ్మా బొజ్జు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ వాతావరణ

# సలహా కార్యక్రమానికి శ్రీకారం

హైదరాబాద్, 30 మే (నగర నిజం) :రాష్ట్ర రైతులకు సమయానుకూల వాతావరణ సమాచారం, శాస్త్రీయ వ్యవసాయ సూచనలు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "తెలంగాణ వాతావరణ సలహా కార్యక్రమం"ను రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం అధికారికంగా ప్రారంభించారు. తెలంగాణ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో డెవలప్‌మెంట్ ఇన్నోవేషన్ ల్యాబ్ ఇండియా, ఎవిడెన్స్ యాక్షన్ సంస్థల సహకారంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ, డెవలప్‌మెంట్ ఇన్నోవేషన్ ల్యాబ్ ఇండియా, ఎవిడెన్స్ యాక్షన్ సంస్థల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. కార్యక్రమంలో ఎవిడెన్స్ యాక్షన్ సంస్థ కంట్రీ డైరెక్టర్ అంకుర్ గర్ న్యూఢిల్లీ నుంచి జూమ్ ద్వారా పాల్గొని, రైతుల కోసం కృత్రిమ మేధస్సు ఆధారంగా అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణలో లక్షలాది మంది రైతులకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వానికి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ధన్యవాదాలు తెలియజేస్తూ భవిష్యత్తులో మరిన్ని సేవలను రైతులకు అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, వాతావరణ మార్పులు వ్యవసాయ రంగానికి సవాళ్లుగా మారుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో రైతులకు ఖచ్చితమైన, సమయానుకూల సమాచారం అందించడం అత్యంత అవసరమన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రైతులకు క్షేత్రస్థాయిలో ఉపయోగపడే సూచనలు అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. మండలాల వారీగా వర్షపాతం, ఉష్ణోగ్రతలు, వాతావరణ పరిస్థితులు, వ్యవసాయ సూచనలను రైతులకు వాట్సాప్ ద్వారా చేరవేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. కృత్రిమ మేధస్సు ఆధారిత వాతావరణ అంచనాల ద్వారా రైతులు సరైన సమయంలో సాగు నిర్ణయాలు తీసుకునే అవకాశం కలుగుతుందని, పంట నష్టాలను తగ్గించడంతో పాటు ఉత్పాదకత పెరుగుతుందని తెలిపారు. రైతుల ఆదాయ వృద్ధి, వాతావరణ అనుకూల వ్యవసాయ విధానాల ప్రోత్సాహానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు. అనంతరం రాబోయే రుతుపవనాలు, వర్షపాతం పరిస్థితులకు సంబంధించిన తొలి వాతావరణ సూచన సందేశాన్ని మంత్రి వాట్సాప్ ద్వారా




రైతులకు పంపించారు. రైతులు నేరుగా వాతావరణ పరిస్థితులు, వ్యవసాయ సూచనలకు సంబంధించిన ప్రశ్నలను వాయిస్ రూపంలో అడిగి సమాధానాలు పొందే విధంగా ఈ వేదికను మరింత అభివృద్ధి చేయాలని సూచించారు. అలాగే ఈ సేవలను మండల స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు విస్తరించేలా అవసరమైన సాంకేతిక మార్పులు చేపట్టాలని సంస్థ ప్రతినిధులను కోరారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి కే. సురేంద్రమోహన్ మాట్లాడుతూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగంలో తెలంగాణ దేశంలో ముందంజలో ఉందన్నారు. తెలంగాణ రైజింగ్--2047 లక్ష్యాల సాధనలో భాగంగా కృత్రిమ మేధస్సు ఆధారిత వ్యవసాయ సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. రాబోయే కాలంలో ఎల్‌నినో వంటి వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు పద్ధతులను అవలంబించేందుకు రైతులకు ఖచ్చితమైన సమాచారం అందించే సామర్థ్యం ఈ వ్యవస్థకు ఉందన్నారు. రాష్ట్రంలోని రైతు భరోసాలో ఫోన్ నంబర్ నమోదైన 17 జిల్లాల పరిధిలోని 304 మండలాలకు చెందిన 15 లక్షల మంది రైతులకు వాట్సాప్ ద్వారా సమాచారం అందించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సంచాలకులు బి. గోపి, సహకార శాఖ ప్రత్యేక సంచాలకులు రాహుల్ రాజ్, ఇతర ఉన్నతాధికారులు, డెవలప్‌మెంట్ ఇన్నోవేషన్ ల్యాబ్ ఇండియా, ఎవిడెన్స్ యాక్షన్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.




# మహానాడు 2026 విజయవంతంపై టీడీపీ నేతలకు అభినందనలు

### ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో టీడీపీ నేతలను గద్దె విజయ్ నేత మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు






హైదరాబాద్, 30 మే (నగర నిజం) :మహానాడు 2026 వర్చువల్ విధానంలో తెలుగు రాష్ట్రాల్లో విజయవంతంగా నిర్వహించిన సందర్భంగా తెలుగుదేశం పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయం ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో టీడీపీ నేతలను గద్దె విజయ్ నేత మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నరసింహులు, రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి ఎన్ దుర్గ ప్రసాద్, రాష్ట్ర ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు పోలంపల్లి అశోక్ కుమార్, రాష్ట్ర బీసీ సెల్ మాజీ అధ్యక్షుడు శ్రీపతి సతీష్‌లను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి టీడీపీ ఆడ్ హాక్ కమిటీ సభ్యుడు బి ఎన్ రెడ్డి, టీడీపీ కాంటెస్టెడ్ కార్పొరేటర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం బక్కని నరసింహులు ఎల్బీనగర్‌లో నిర్వహించిన నందమూరి తారకరామారావు జయంతి కార్యక్రమాల గురించి గద్దె విజయ్ నేతతో మాట్లాడి పలు విషయాలను తెలుసుకున్నారు. పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యక్రమాలపై కూడా చర్చించినట్లు తెలిపారు.

# మండుటెండల నేపథ్యంలో ఉదయాన్నే రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

హైదరాబాద్, 30, మే (నగర నిజం) :మండుటెండల తీవ్రత దృష్ట్యా ఈసారి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఉదయం పూట నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జూన్ 2న సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్ లో జరిగే రాష్ట్ర అవతరణ వేడుకలను ఉదయం 8.30 గంటలకే ప్రారంభించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. జాతీయ పతాకావిష్కరణతో పాటు అన్ని అవతరణ ఉత్సవ కార్యక్రమాలను గంటన్నర వ్యవధిలో పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ఎండల తీవ్రత కారణంగా వేడుకలకు హాజరయ్యే ప్రజలు, అతిథులు ఇబ్బందులు పడకుండా తాగునీరు, నీడ, వైద్య సదుపాయాలు వంటి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. వేడుకలు సజావుగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు సమాచారం.

# ఎరువుల సమతుల్య వినియోగంపై రైతులకు అవగాహన



**29 మే, 2026న తెలంగాణ రాష్ట్రంలోని బాలానగర్ మండలం మహబూబ్ నగర్ జిల్లా చిన్న రేవల్లి గ్రామంలో రూడీ విత్తన శుద్ధిపై ప్రదర్శన**

మహబూబ్‌నగర్, 30 మే (నగర నిజం) :ఎరువుల సమతుల్య వినియోగంపై రైతుల్లో అవగాహన పెంపొందించేందుకు హైదరాబాద్‌కు చెందిన ఐకార్-క్రీడా ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం చిన్న రేవల్లి గ్రామంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తల బృందం రైతులతో సమావేశమై పలు సూచనలు చేసింది. కార్యక్రమ ప్రారంభంలో వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త అన్షిదా బీవి సిఎన్ కార్యక్రమ ఉద్దేశాలను వివరించారు. అనంతరం వ్యవసాయ వాతావరణ శాస్త్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శరత్ చంద్రన్ ఎంఏ మాట్లాడుతూ దిగుబడులను స్థిరంగా నిలబెట్టుకోవడంతో పాటు నేల ఆరోగ్య పరిరక్షణకు ఎరువులను సమతుల్యంగా వినియోగించడం అత్యంత అవసరమని తెలిపారు. ఈ సందర్భంగా నేలలో భాస్వరం లభ్యతను పెంచేందుకు భాస్వరం కరిగించే బ్యాక్టీరియా (పీఎస్‌బీ)తో విత్తన శుద్ధి చేసే విధానాన్ని శాస్త్రవేత్తలు ప్రదర్శించారు. రైతుల్లో ఒకరితో ప్రత్యక్షంగా విత్తన శుద్ధి ప్రక్రియ చేయించి, ఇతర రైతులకు వివరించేలా ప్రోత్సహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెంకట్ రామ్ గౌడ్, గ్రామ కార్యదర్శి బల్‌రాజ్, వ్యవసాయ ఉత్పాదకాల డీలర్ నాగేందర్ పాల్గొన్నారు. మొత్తం 30 మంది రైతులు హాజరుకాగా, వారిలో ఇద్దరు మహిళలు ఉన్నారు. గ్రామంలోని రైతు సేవా కేంద్రం ప్రతినిధులు, వ్యవసాయ విస్తరణ అధికారి నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రైస్ మిల్లర్లతో కుమ్మక్కై రైతులకు అన్యాయం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు



కరీంనగర్ మే 30 ;తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు మరియు ఎమ్మెల్సీలు క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించినప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్య వైఖరి స్పష్టంగా బయటపడిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు గారు తెలిపారు. పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్ కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ జిల్లాలో నిర్వహించిన మీడియా సమావేశంలో రాంచందర్ రావు మాట్లాడుతూ... అధికారుల అండతో రైతులపై ఒత్తిడి తెస్తూ ధాన్యాన్ని బలవంతంగా రైస్ మిల్లర్లకు తరలిస్తున్నారని ఆయన ఆరోపించారు. కనీసం గన్నీ బ్యాగులు కూడా ఇవ్వకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, క్వింటాల్‌కు 41 కిలోల తూకం ఉన్నప్పటికీ, రైస్ మిల్లర్లు తరుగు పేరుతో 10 కిలోల వరకు కోత విధిస్తూ రైతులను తీవ్రంగా దోచుకుంటున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఎంఎస్‌పీ ధరను నిర్ణయించి, కొనుగోలుకు అయ్యే వ్యయాన్ని, రవాణా ఖర్చులను రీయింబర్స్ చేస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రైస్ మిల్లర్లతో కుమ్మక్కై రైతులకు అన్యాయం చేస్తోందని విమర్శించారు.కాంగ్రెస్ మంత్రుల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల కొనుగోలు గణాంకాలపై పరస్పర విరుద్ధమైన ప్రకటనలు వస్తున్నాయని, ఇది రైతులను తప్పుదారి పట్టించడమేనని రాంచందర్ రావు గారు పేర్కొన్నారు. ధాన్యంతో పాటు మొక్కజొన్న పంటకు కూడా ఇదే దుస్థితి పట్టిందని, జమ్మికుంటతో పాటు అనేక మార్కెట్ యార్డుల్లో మొక్కజొన్న నిల్వలు పేరుకుపోయాని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మార్క్ ఫెడ్ ద్వారా కేంద్ర నిధులతో వీటిని తక్షణమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాల వల్ల ధాన్యం తడిసి ముద్దవ్వడమే కాకుండా, మామిడి రైతులు కూడా తీవ్రంగా నష్టపోయారని, జిల్లా కలెక్టర్లు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేసి, బాధితులకు తక్షణమే నష్టపరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుల గోసను పట్టించుకోకుండా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం వాస్తవాలను గుర్తించి, రైతులను ఆదుకోవాలని బీజేపీ హెచ్చరిస్తోందని రాంచందర్ రావు గారు తెలిపారు.

# వడ్రంగి, స్వర్ణకార, కమ్మర, కంచరి మరియు శిల్పులను విశ్వబ్రాహ్మ ణులు గా గుర్తించాలి

- అఖిల భారత విశ్వకర్మ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు కౌలే జగన్నాధం



వడ్రంగి, స్వర్ణకార, కమ్మర, కంచరి మరియు శిల్పులను విశ్వబ్రాహ్మ ణులుగా గుర్తించాలనిఅఖిల భారత విశ్వకర్మ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు కౌలే జగన్నాధం విజ్ఞప్తి చేశారు.ఈ మేరకు పీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్‌ను గాంధీ భవన్ లో కలిసి మన పంచ వృత్తులైన వడ్రంగి, స్వర్ణకార, కమ్మర, కంచరి మరియు శిల్పుల జనాభాను ఏకీకృతం చేసి విశ్వబ్రాహ్మణ/ విశ్వకర్మ కులం గా పరిగణించి ప్రకటించుటకు ప్రభుత్వంతో మాట్లాడాలని విజ్ఞాపన పత్రము అందజేసారు. అందుకు మహేష్ గౌడ్ సానుకూలంగా స్పందిస్తూ దానికి ఆయన అలాగే చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశానికి హాజరైన కౌలే జగన్నాధం అధ్యక్షులు, పడాల సతీష్ చారి అధికార ప్రతినిధి, కనపర్తి లక్ష్మణ్ చారి గౌరవ సలహాదారు, కొల్లోజు శ్రీనివాస్ చారి ఉపాధ్యక్షులు, కస్తోజు శ్రావణి మహిళా అధికార ప్రతినిధి , మూట కోదూరు పద్మశ్రీ అధ్యక్షులు కల్చరల్ కమిటీ మరియు కె లోకనాథం జుజ మెంబర్ తదితరులు హాజరైన్నారు

# దర్యాప్తులు వేగంగా పూర్తి చేసి ప్రజలకు న్యాయం చేయాలి






- మహేశ్వరం పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన ఫ్యూచర్ సిటీ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి

**మహేశ్వరం మే 30 ,(నగరనిజం) :** పోలీస్ స్టేషన్ లో నమోదవుతున్న కేసులకు సంబంధించిన దర్యాప్తులో వేగం పెంచి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఫ్యూచర్ సిటీ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి ఆదేశించారు. ఫ్యూచర్ సిటీ పరిధిలోని మహేశ్వరం పోలీస్ స్టేషన్ ను ఆయన శనివారం మహేశ్వరం డివిజన్ డిసిపి నారాయణరెడ్డితో కలిసి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. అనంతరం స్టేషన్ పరిసరాలను పరిశీలించి స్టేషన్ లో నమోదవుతున్న వివిధ కేసుల వివరాలు పోలీస్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నా. స్టేషన్ లో నిర్వహిస్తున్న రికార్డులు, కేసుల దర్యాప్తు, పురోగతి పెండింగ్ కేసుల స్థితిగతులను ప్రజలకు అందిస్తున్న సేవలపై సిపి మహేశ్వరం పోలీసులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సకాలంలో స్వీకరించి వాటిని పారదర్శకంగా పరిష్కరించాలని ఆదేశించారు. స్టేషన్‌కు వచ్చే బాధితులతో స్టేషన్ సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. నేరాల నియంత్రణతో పాటు శాంతి భద్రతలు పరిరక్షణకు మరింత కృషి చేయాలని ఆయన ఆదేశించారు. పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన సందర్భంగా సిబ్బంది పనితీరుపై కమిషనర్ తరుణ్ జోషి సంతోషం వ్యక్తం చేశారు. ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచే విధంగా సేవలు కొనసాగించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం సిఐ రాఘవేందర్ రెడ్డి ఎస్సైలు ప్రసాద్ రాఘవేందర్ ధనుంజయ్ పాల్గొన్నారు.

## ఆపరేషన్ సిందూర్ 2.0’కు అంతా సిద్ధం: ఆర్మీ చీఫ్



**న్యూ డిల్లి మే 30 :** త్రివిధ దళాలు ఆపరేషన్ సిందూర్ 2.0 కోసం సిద్ధంగా ఉన్నాయని ఆర్మీ చీఫ్ ద్వివేది వెల్లడించారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ (చీణూ) పాసింగ్ ఔట్ పరేడ్లో యుద్ధ సన్నద్ధతపై మాట్లాడారు. మానవ రహిత రక్షణ వ్యవస్థలను బలోపేతం చేసినట్లు తెలిపారు. కాగా అశ్నీ డ్రోన్ ప్లటూన్స్, దివ్యాస్త్ర బ్యాటరీస్తో పనిచేసే ఆర్టిలరీ, శక్తిబాన్ రెజిమెంట్స్, శౌర్య స్క్వాడ్రన్స్ వంటి అన్‌ఆర్మ్ సిస్టమ్స్ రివ్యూకు సిద్ధంగా ఉన్నాయి.

సరస్వతి పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

# చెంగిచెర్ల డిపో మేనేజర్ కే.కవిత



**హైద్రాబాద్ (ఉప్పల్ )మే 30:** సరస్వతి పుష్కరాల కోసం వెళ్లే భక్తులకు స్పెషల్ సర్వీసులు ఏర్పాటు చేసినట్లు చెంగిచెర్ల డిపో మేనేజర్ కే.కవిత తెలిపారు. కాళేశ్వరం, పుష్కరఘాట్, భద్రకాళి ఆలయం వంటి ప్రముఖ పుణ్య క్షేత్రాలకు పెద్దలకు రూ.1000, పిల్లలకు రూ.600గా నిర్ణయించినట్లు తెలిపారు. రేపు ఉదయం 7:00 గంటల నుంచి సర్వీసులు ఉంటాయని తెలిపారు.ఏవేని కాలనీ వాసులు 20,30 పుష్కరాలకు వెళుతామని తెలిపితే వారికోసం ప్రత్యేక బస్సు ను ఫైన్స్ పేర్కొన్న ఛార్జీలకే ఏర్పాటు చేయనున్నట్లు కవిత వివరించారు.మరిన్ని వివరాలకు 9110505820, 9948886516 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

# మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అరెస్ట్?



**హైద్రాబాద్ మే 30;** బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్? చేశారు. తీవ్ర ఉద్రికత అనంతరం తెలంగాణ భవన్ వద్ద సుమన్‌ను నాంపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సుమన్ ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు. తనను మరోసారి జైలుకు పంపాలని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి వివేక్ నిర్ణయించారన్న సుమన్.. జైల్లో పెట్టి పైశాచికానందం పొందాలని భావిస్తున్నారని? ఆరోపించారు.వివిధ సెక్షన్?లపై కేసునమోదు : మిలిటెంట్ తరహా ఉద్యమాలు చేయాలంటూ ఇటీవల బాల్క సుమన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్? నేతలు నాంపల్లి పోలీస్? స్టేషన్?లో ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ నేతల ఫిర్యాదుతో.. సుమన్‌పై 326(జి), 351(3), 353(1)(బి), రెడ్ విత్ 55, రెడ్ విత్ 61(2)(ఎ), బీఎన్ఎస్ 4 పీడీపీపీఏ కింద కేసు నమోదు చేశారు.పోలీసులు గో బ్యాక్? అంటూ : బాల్క సుమన్?ను అరెస్ట్? చేసేందుకు పోలీసులు రావడంతో కొంతసేపు తెలంగాణ భవన్? వద్ద ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు గో బ్యాక్? అంటూ పార్టీ కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ పరిస్థితుల నేపథ్యంతో అక్కడ భారీగా పోలీసులు మోహరించారు. పోలీసులతో బీఆర్?ఎస్? లీగల్? టీం సభ్యులు మాట్లాడారు. నాన్?బెయిలబుల్? కేసు నమోదు చేశామని, అందువల్ల ముందస్తు నోటీసులు ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. దీంతో అక్కడ కాసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది.

## దెబ్బతిన్న రహదారితో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు

- రహదారి పనులు మొదలు పెట్టకపోతే ఆందోళనలు కొనసాగిస్తాం
- హెచ్చరించిన దావూద్ గూడ గ్రామ ఉపసర్పంచ్ ఆర్ తేజా నాయక్



**మహేశ్వరం మే 30 (నగరనిజం) :** మహేశ్వరం మండలంలోని దావుద్ గూడ గ్రామం నుంచి పులిమామిడి వయా పోచమ్మగడ్డ వరకు వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతినడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దావుద్ గూడ ఉపసర్పంచ్ ఆర్ తేజ నాయక్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రహదారి నిర్మాణ పనులు రెండేళ్ల క్రితం ప్రారంభమైనప్పటికీ ఇప్పటి వరకు పూర్తి కాలేదని ఆయన తెలిపారు.అసంపూర్తిగా ఉన్న పనుల కారణంగా రహదారిపై పెద్ద గుంతలు ఏర్పడి వర్షాకాలంలో మరింత ప్రమాదకరంగా మారుతోందన్నారు. ప్రతిరోజూ ఈ మార్గంలో ప్రయాణించే విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా సరైన చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అధికారులు వెంటనే స్పందించి రహదారి నిర్మాణ పనులను పూర్తి చేసి ప్రయాణానికి అనుకూలంగా మార్చాలని తేజ నాయక్ కోరారు. లేకపోతే గ్రామస్తులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

## ప్రభుత్వ ఉద్యోగి ఎవరైనా వదవీ విరమణ జరగాలి

- మండల సర్పంచ్ సంఘం ప్రధాన కార్యదర్శి మాడి రాజేందర్రెడ్డి
- ఎస్సైకు మన సన్మానం




**మొయినాబాద్, మే 30(నగర నిజం):** ఉద్యోగ రిత్య వదవీ విరమణ ఉద్యోగులకు సహజమేనని వని చేసిన చోట ప్రజలకు సేవలు అందించినప్పుడే ప్రజలు గుర్తిస్తారని మొయినాబాద్ మండల సర్పంచ్ల సంఘం ప్రధాన కార్యదర్శి మాడి రాజేందర్రెడ్డి అన్నారు. వికారాబాద్లో ఎస్సై నరేందర్రెడ్డి వదవీ విరమణ సన్మాన సభకు మొయినాబాద్ మండల సర్పంచ్ సంఘం సభ్యులు తరలి వెళ్లి సన్మానించారు. ఈ సందర్భంగా మండల సర్పంచ్ సంఘం ప్రధాన కార్యదర్శి మాడి రాజేందర్రెడ్డి సభ్యులతో కలిసి ఎస్సై నరేందర్రెడ్డిని సన్మానించి ఆయన మాట్లాడుతూ ఉద్యోగ రిత్య వదవీ విరమణ సహజమేనని అన్నారు. ఉద్యోగులు ఎక్కడ వని చేసిన అక్కడి ప్రజలకు న్యాయబద్ధంగా వని చేసినప్పుడే ఆ ప్రజలు ఆ ఉద్యోగులను ఎన్నటికి మరచిపోలేరని గుర్తు చేశారు. ఎస్సై నరేందర్రెడ్డి సన్మాన సభకు ఎంతో మంది రావడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో వలువురు సర్పంచ్లు, నాయకులు పాల్గొన్నారు.

# తెలంగాణలో భారీగా తగ్గనున్న టెక్స్ బుక్స్ దర్సలు



**హైదరాబాద్, మే 30:** 2026-27 విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో తల్లిదండ్రులు, విద్యార్థులకు భారీ ఊరటను ఇచ్చే వార్త వచ్చింది. విద్యార్థుల పుస్తకాల ధరలు భారీగా తగ్గడం విశేషం. ఒకటవ తరగతి నుంచి 10వ తరగతి పాఠ్య పుస్తకాల ధరలు తగ్గడంతో.. ఆర్థికంగా కాస్త రిలీఫ్ లభించింది. గరిష్ఠంగా 20 శాతం వరకు ధరలు తగ్గడంతో విద్యార్థులు ఆనందంగా ఫీల్ అవుతున్నారు. ఒకవైపు యుద్ధం కారణంగా అన్ని రకాల వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్న వేళ.. పుస్తకాల ధరలు తగ్గడం గమనార్హం. అయితే ప్రభుత్వ పాఠ్యపుస్తకాల విభాగం కొన్ని రోజుల క్రితం పుస్తకాల ప్రింటింగ్ కోసం.. టెండర్లను పిలిచింది. ఈ టెండర్లలో 3 ప్రింటింగ్ సంస్థలు గతం కంటే 20 శాతం తక్కువగా కోట్ చేయడంతో పుస్తకాల ధరలు దిగి వచ్చాయి.గతంలో ఒక్కో పేజీ ప్రింటింగ్ ధర 54 పైసలు ఉండగా.. అది ప్రస్తుతం 44.50 పైసలకు దిగి వచ్చింది. ఉదాహరణకు 1వ తరగతిలోని 3 పుస్తకాలు కలిపి గతేడాది రూ.247లు కాగా.. ఈసారి రూ.209కి తగ్గాయి. ఇఖ 10వ తరగతిలోని మొత్తం 8 పుస్తకాల ధర గత విద్యా సంవత్సరంలో రూ.1,078 ఉండగా ఈసారి రూ.900కితగ్గింది. అంటే.. ఒక్క టెన్త్ క్లాస్ విద్యార్థులకు ఈ ఏడాది రూ.178 ఆదా అయ్యాయి. జూన్ 5వ తేదీ నుంచి కొత్త పుస్తకాలు మార్కెట్లో అందుబాటులోకి రానున్నాయి. మరోవైపు.. పుస్తకాల ధరలు తగ్గినంత మాత్రాన.. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రింటింగ్లో, బైండింగ్లో ఎలాంటి రాజీ లేకుండా.. మెరుగైన క్వాలిటీతో లామినేటెడ్ పుస్తకాలను విద్యార్థులకు అందుబాటులోకి రానున్నాయి. ఇక.. వరుసగా 4వ ఏడాది కూడా పాఠ్యపుస్తకాల ధరలు తగ్గడంతో.. విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక భారం తప్పింది. 2023-24 అకడమిక్ ఇయర్ లో 10వ తరగతి విద్యార్థుల పుస్తకాల కోసం రూ.1,482 ఖర్చు కాగా.. 2025-26లో అది రూ.1,078కు దిగి వచ్చింది. తాజా తగ్గింపుతో ఈ ఏడాది టెన్త్ టెక్ట్స్ బుక్స్ సెట్ ధర రూ.900కు తగ్గింది. అదే విధంగా 9వ తరగతి పుస్తకాల సెట్ ధర రూ.927 నుంచి రూ.776కు (రూ.151) తగ్గింది. 8వ తరగతి పుస్తకాల సెట్ ధర రూ.825 నుంచి రూ.690కి (రూ.135) తగ్గాయి. ప్రైమరీ క్లాసులకు కూడా ఒక్కో సెట్పై రూ.35 నుంచి రూ.60 వరకు ధరలు తగ్గాయి. ఇక సబ్జెక్టుల వారీగా పుస్తకాల ధర తగ్గింపు చూస్తే.. టెన్త్ మ్యాథ్స్ టెక్ట్స్ బుక్ ధర గతంలో రూ.225 ఉ ందగా.. ఇప్పుడు రూ.187కు తగ్గింది. సోషల్ పుస్తకం రూ.192 నుంచి రూ.160కి తగ్గింది. 9వ తరగతి మ్యాథ్స్ బుక్ రూ.201 నుంచి రూ.167కు.. 8వ తరగతి మ్యాథ్స్ రూ.205 నుంచి రూ.171కి తగ్గిందిఅయితే గతం కంటే ఇప్పుడు.. ముడి సరుకుల ధరలు 20 శాతం పెరిగినప్పటికీ.. పబ్లిషర్లు మాత్రం గతేడాది కంటే తక్కువ ధరకే పుస్తకాలను ముద్రించేందుకు ముందుకు రావడం గమనార-గతేడాది ఎల్1 గా నిలిచిన ఆర్బర్డ్ సంస్థ పేజీకి 54 పైస చేయగా.. ఈ ఏడాది నవతెలంగాణ ప్రింటర్స్, డీకే పబ్లికేషన్స్ ప్రింటర్స్ సంస్థలు కేవలం 44.50 పైసలకే పుస్తకాలను ప్రింట్ చేబి ప్రకటించి.. ఎల్-1గా నిలిచాయి.

# ఒకే ఇంటికి ఒకే గ్యాస్ కనెక్షన్



జూన్ 1 నుంచి అమలులోకి దేశంలో LPG కొరత రాకుండా కేంద్రం చర్యలుచేపట్టింది. అందులో భాగంగా ఒక ఇంటికి ఒకే కనెక్షన్ రూల్ తీసుకొచ్చింది. PNG సప్లై ఉన్నవాళ్లుLPG కనెక్షన్ను వదులుకోవాలని ఇప్పటికేకోరింది. అయితే జూన్ 1 నుంచి అలాంటి వారికిఆటోమేటిక్గా LPG కనెక్షన్ కట్ కానుంది. వీరు సిలిండర్ రీఫిల్లింగ్ కోసం బుక్ చేసుకోలేరు. ఈమేరకు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు, డిస్ట్రిబ్యూషన్ ఏజెన్సీలు తమ డిజిటల్ డేటాబేస్ను అనుసంధానించాయి.

# నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

- మహేశ్వరం ఏఈ చక్రపాణి



**మహేశ్వరం మే 30 ,(నగరనిజం)** :నేడు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మహేశ్వరం ఏఈ చక్రపాణి ఒక ప్రకటనలో తెలిపారు. నేడు (ఆదివారం) ఫ్యాబ్సిటీ 8 ఎంబీఏ పవర్ ట్రాన్స్ఫర్ స్థానంలో 12.5 ఎంబీఏ పవర్ ట్రాన్స్ఫర్ ను ఏర్పాటు చేస్తున్నందున ఉదయం 8 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ఫ్యాబ్సిటీ పరిధిలోని ఇండస్ట్రియల్ ఏరియాలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఆయన తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సంస్థకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# పిల్లల ఆరోగ్యమే దేశ భవిష్యత్తు

- పోషకాహారంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించిన సీడీపీఓ వెంకటరమణ




**వలిగొండ । మే 30( నగర నిజం):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం సంగం గ్రామంలో శనివారం నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99వ రోజు కార్యక్రమంలో భాగంగా చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారం ప్రాముఖ్యతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీడీపీఓ వెంకటరమణ మాట్లాడుతూ, మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను తప్పనిసరిగా అంగన్వాడీ కేంద్రాలకు పంపించి, ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రుల కు సూచించారు. చిన్ననాటి నుంచే సరైన పోషకాహారం అందితే పిల్లలు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఎదుగుతారని ఆమె తెలిపారు. కార్యక్రమంలో సూపర్వైజర్ బాలమణి, అంగన్వాడీ టీచర్ కేసరి ప్రేమలత, సీహెచ్ రజిని మరియు ఆయాలు పాల్గొని తల్లిదండ్రులకు పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, విద్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాలరాజు, శ్రావణి, పంచశ్యామల, భారతరాజు, మౌనిక, రాజేశ్వరి, కాసుల అరిషిత, కాసుల నిఖిత, బైరు శ్రీవాణి, ధనలక్ష్మి తదితరులు, ఆయాలు మరియు చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. "ప్రతి చిన్నారికి పోషకాహారం – ప్రతి కుటుంబానికి ఆరోగ్యకర భవిష్యత్తు" అనే సందేశంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# రాయికల్ మండల ప్రధానోపాధ్యాయులకు ఘన సన్మానం



**రాయికల్ మే 30 (నగర నిజం)** ఇటీవల విడుదలైన 2026 ఎస్సెస్సీ ఫలితాల్లో రాయికల్ మండలంలోని పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు వంద శాతం (100%) ఉత్తీర్ణత సాధించి రికార్డు సృష్టించాయి. ఈ అద్భుతమైన విజయాన్ని పురస్కరించుకుని, విద్యార్థులను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించిన మండలంలోని ప్రధానోపాధ్యాయులను పిఆర్టియు జగిత్యాల జిల్లా శాఖలి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండలంలో వంద శాతం ఫలితాలు సాధించిన కింది పాఠశాలల ప్రధానోపాధ్యాయులను జగిత్యాల జిల్లా విద్యా శాఖ అధికారి రాము గారు, జగిత్యాల జిల్లా గ్రంథాలయ చైర్మన్ దినేష్ గారు,రాయికల్ మండల విద్యాధికారి రాఘవులు గారు PRTU TS తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పులగం దామోదర్ రెడ్డి, అధికార ప్రతినిధి వంగ మహేందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు ఆనందరావు ప్రధాన కార్యదర్శి అమర్నాథ్ రెడ్డి, మండల బాధ్యులు గంగరాజం పొన్నం రమేష్ కన్నవేణి మల్లారెడ్డి దొంతి సతీష్ బొమ్మగంటి రవికుమార్ జాదవ్ వసంతరావు మరియు స్థానిక ప్రజలు తల్లిదండ్రులు అభినందించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (ZPHS) అల్లీపూర్ – ప్రధానోపాధ్యాయులు పి. కిరణ్ గారు ZPHS భూపతిపూర్ – ప్రధానోపాధ్యాయులు రమణి గారు ZPHS ఇటిక్యాల – ప్రధానోపాధ్యాయులు సదాశివ్ గారు ZPHS మూటపల్లి -- ప్రధానోపాధ్యాయులు రాజు గారు ఉర్దూ మీడియం (U/M) రాయికల్ – ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ గారు ZPHS ఆలూర్ – ప్రధానోపాధ్యాయులు లక్ష్మయ్య గారు ZPHS కొత్తపేట్– ప్రధానోపాధ్యాయులు బాపురావు కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ( రాయికల్ – ప్రత్యేక అధికారి (గా) శోభ గారుప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తూ, ప్రత్యేక ప్రణాళికలతో విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేసి మండల కీర్తిని రాష్ట్ర స్థాయిలో చాటిచెప్పిన ఈ ప్రధానోపాధ్యాయులందరి కృషి ఎంతో అభినందనీయమని PRTU TS ప్రతినిధులు కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఇదే రకమైన ఫలితాలను సాధిస్తూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మండల విద్యా శాఖ అధికారులు, ఉపాధ్యాయులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొని సన్మాన గ్రహీతలకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఇన్సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహణకు సర్కార్ కసరత్తు





- జగిత్యాలలో ఘనంగా పీఆర్టీయూటీఎస్ ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం

**జగిత్యాల్ మే 30 (నగర నిజం)** జగిత్యాల పట్టణంలోని పొన్నాల గార్డెన్స్లో పీఆర్టీయూటీఎస్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రధానోపాధ్యాయులు, జిల్లా మరియు మండల టాపర్ విద్యార్థులకు ప్రతిభా అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పులగం దామోదర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. ఎస్సీఈఆర్టీ అధికారుల ఆమోదం పొందిన ఫైల్ ప్రస్తుతం ముఖ్యమంత్రి పరిశీలనలో ఉందని, ఆమోదం లభించిన వెంటనే ప్రత్యేక టెట్ నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ టెట్ను సంవత్సరానికి మూడుసార్లు నిర్వహించే అవకాశం ఉందన్నారు. హెల్త్ కార్డుల విషయంలో ఉపాధ్యాయులు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని, ట్రస్ట్ ఆధ్వర్యంలో పారదర్శకంగా అమలు జరుగుతుందని వివరించారు. జనాభా లెక్కల ప్రక్రియ జూన్ 9తో ముగియనున్నందున జూలై నెలలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టే అవకాశం ఉందన్నారు. పెండింగ్ బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం హామీ ఇచ్చిందని, పీఆర్సీ నివేదికను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకాన్ని ప్రవేశపెట్టడం స్వాగతించదగిన నిర్ణయమన్నారు. కార్యక్రమంలో జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘనపట్ల దినేష్, జిల్లా విద్యాధికారి రాము పాల్గొని విద్యా రంగ అభివృద్ధిలో ఉపాధ్యాయుల సేవలను ప్రశంసించారు. అనంతరం జిల్లా, మండల టాపర్ విద్యార్థులతో పాటు 100 శాతం ఫలితాలు సాధించిన 178 మంది ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లను ఘనంగా సన్మానించారు.

# జిల్లా స్థాయిలోనే ౯౦ శాతం వైద్య సేవలు అందించాలి

- 14-15 ఏళ్ల బాలికలందరికీ హెచ్పీవీ వ్యాక్సిన్ అందేలా చర్యలు తీసుకోవాలి
- కంకోల్, సింగితం పీహెచ్సీలు, సంగారెడ్డి నర్సింగ్ కళాశాలను ప్రారంభానికి సిద్ధం చేయాలి.....
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ




**నగర నిజం సంగారెడ్డి, మే 30:**--జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రజలకు 90 శాతం వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని, అత్యవసర పరిస్థితులు మినహా రోగులను ఇతర ప్రాంతాలకు రిఫర్ చేసే పరిస్థితి రాకుండా వైద్య సేవలను మరింత బలోపేతం చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్తో కలిసి వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో మంత్రి జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుతున్న వైద్య సేవలు, ఓపీ, ఐపీ, ప్రసవాలు, వివిధ విభాగాల సేవలు, మేజర్ శస్త్రచికిత్సలు, అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, అవసరమైన వసతులు, డిజిటల్ హెల్త్ కార్డు పురోగతి తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలను సమర్థవంతంగా వినియోగించి, ప్రతి రోగికి సకాలంలో మెరుగైన చికిత్స అందించడం వైద్య సిబ్బంది బాధ్యత అని పేర్కొన్నారు. జిల్లాలో 14 నుంచి 15 సంవత్సరాల వయస్సు గల బాలికలందరికీ హెచ్పీవీ (హ్యూ) వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయాలని, జిల్లా విద్యాశాఖ అధికారి, సంక్షేమ అధికారి, మహిళా సంఘాల ప్రతినిధులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సమన్వయంతో అర్హులైన ప్రతి బాలికకు వ్యాక్సిన్ అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. కంకోల్, సింగితం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనాలు, సంగారెడ్డి నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులు పూర్తయిన నేపథ్యంలో వాటిని ప్రారంభానికి సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్) సూపరింటెండెంట్ డా. అనిల్ కుమార్ ఆసుపత్రిలో అదనంగా మరో సీటీ స్కానర్ అవసరమని మంత్రికి వివరించగా, వెంటనే మంజూరు కోసం ప్రతిపాదనలు పంపాలని మంత్రి సూచించారు. అలాగే జిల్లాలో ప్రస్తుతం తొమ్మిది ఆర్బీఎస్కే (=దీూఖ) బృందాలు మాత్రమే ఉన్నాయని, మరో మూడు బృందాలు అవసరమని కోరగా, అందుకు సంబంధించిన ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖకు చెందిన అన్ని విభాగాల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మంత్రి సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. అనిల్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి , ఏరియా ఆసుపత్రుల వైద్యులు, వివిధ కార్యక్రమాల అధికారులు, సంబంధిత విభాగాల వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్లో అత్యాచారం కేసు నమోదు.. నిందితుడు అరెస్ట్

**మేడ్చల్, మే 30 (నగర నిజం):** మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అత్యాచారం కేసు నమోదై, నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు జవహర్నగర్ పోలీస్ స్టేషన్లో మే 28న జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేయగా, తదుపరి విచారణ నిమిత్తం కేసును మేడ్చల్ పోలీస్ స్టేషన్కు బదిలీ చేశారు. అనంతరం మే 29న మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల వివరాల ప్రకారం, కేసు దర్యాప్తును మేడ్చల్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎ. సత్యనారాయణ పర్యవేక్షిస్తున్నారు. బాధితురాలి వాంగ్మూలాన్ని మహిళా ఎస్ఐ నమోదు చేశారు. బాధితురాలికి వైద్య పరీక్షలు నిర్వహించి, సేకరించిన నమూనాలను ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్),




హైదరాబాద్కు పంపినట్లు తెలిపారు. ఈ కేసులో సాధనాల సంతోష్ కుమార్ (20), తూప్రాన్, మెదక్ జిల్లా వాసిని నిందితుడిగా గుర్తించిన పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. దర్యాప్తులో భాగంగా నిందితుడి వద్ద నుంచి ఒక ఒప్పో మొబైల్ ఫోన్తో పాటు రెండు ట్యాబ్లను స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నారు. కేసుకు సంబంధించిన అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందని, ఫోరెన్సిక్ నివేదికలు మరియు ఇతర సాక్ష్యాధారాల ఆధారంగా తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు. ప్రస్తుతం కేసు విచారణ కొనసాగుతోంది.

# పెట్బషీరాబాద్ ఏసీపీ బాల గంగిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన జాలిగం రాకేష్

**కుత్బుల్లాపూర్, మే 30 (నగర నిజం ప్రతినిధి):** పెట్బషీరాబాద్ ఏసీపీ బాల గంగిరెడ్డి గారిని ఈరోజు రాజారెడ్డి అన్న గారితో కలిసి BRS పార్టీ యువ నాయకులు జాలిగం రాకేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏసీపీ కార్యాలయంలో జరిగిన ఈ భేటీ స్నేహపూర్వక వాతావరణంలో కొనసాగింది. ప్రజలకు మెరుగైన భద్రతా సేవలు అందించడంలో పోలీస్ శాఖ చేస్తున్న కృషిని జాలిగం రాకేష్ అభినందించారు. ముఖ్యంగా ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు పోలీసులు తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ సమస్యల నివారణ, యువతలో చైతన్యం కల్పించడం వంటి అంశాలపై ఈ




సందర్భంగా చర్చించినట్లు తెలిపారు. అలాగే సమాజంలో శాంతియుత వాతావరణం నెలకొనాలంటే ప్రజలు మరియు పోలీస్ శాఖ పరస్పర సహకారంతో ముందుకు సాగాలని అభిప్రాయపడ్డారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్న పోలీస్ అధికారులకు జాలిగం రాకేష్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఏసీపీ బాల గంగిరెడ్డి గారికి శుభాకాంక్షలు తెలియజేసిన జాలిగం రాకేష్, ప్రజా సేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అనంతరం పరస్పరం ఆత్మీయంగా మాట్లాడుకొని నియోజకవర్గ అభివృద్ధికి కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

# అవయవ రక్షణ శస్త్రచికిత్సల్లో టిఆర్ ఆర్ హాస్పిటల్‌కు విశేష విజయాలు


- **ఇలిజారోవ్ పద్ధతితో 13 సెం.మీ. ఎముక పునర్నిర్మాణం కాలు తొలగించే పరిస్థితి నుంచి రోగికి కొత్త జీవితం**



**ఖమ్మం :(నగర నిజం బ్యూరో)మే 30:** క్లిష్టమైన ఎముక గాయాలు, ఇన్‌ఫెక్షన్లు మరియు ప్రమాదాల్లో అవయవ రక్షణ చికిత్సలో ఖమ్మంలోని టిఆర్ ఆర్ ఆర్థో యాక్సిడెంట్ కేర్ హాస్పిటల్ వైద్య బృందం విశేష ఫలితాలు సాధించినట్లు ప్రముఖ ఆర్థోపెడిక్ శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ తోట లక్ష్మణ్ కుమార్ తెలిపారు. శనివారం ఆసుపత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేవలం ఏడాదిన్నర కాలంలోనే అనేక అరుదైన, క్లిష్టమైన ఆర్థోపెడిక్ కేసులకు విజయవంతంగా చికిత్స అందించినట్లు వెల్లడించారు. వైద్యుల వివరాల ప్రకారం, తీవ్రమైన క్రష్ ఇంజరీలతో ఎముకలు, మృదు కణజాలం దెబ్బతిన్న పలువురు రోగులకు ఇలిజారోవ్ టెక్నిక్ ద్వారా అవయవ రక్షణ చికిత్స అందించారు. ఈ పద్ధతిలో ఎముక పెంపు (బోన్ లింగ్ థింకింగ్ ) మరియు ఎముక పునర్నిర్మాణం బోన్ రీ కన్స్ట్రక్షన్ చేసి మంచి ఫలితాలు సాధించినట్లు తెలిపారు. శ్రీలత అనే మహిళకు జరిగిన తీవ్రమైన క్రష్ ఇంజరీ తర్వాత ఇలిజారోవ్ పద్ధతితో 12.2 సెంటీమీటర్ల ఎముక పెంపుచేసి అవయవాన్ని కాపాడినట్లు పేర్కొన్నారు. అలాగే ఇన్‌ఫెక్టెడ్ నాన్-యూనియన్ టిబియా సమస్యతో బాధపడుతున్న ఉదయ్‌కు 6 సెంటీమీటర్ల లింబ్ లెంగ్తెనింగ్, సురేష్‌కు 8 సెంటీమీటర్ల ఎముక పెంపు విజయవంతంగానిర్వహించినట్లు వెల్లడించారు. అత్యంత క్లిష్టమైన కేసుగా లారీ డ్రైవర్ సోమేశ్వరరావు చికిత్సను వైద్యులు వివరించారు. రెండు కాళ్లలో తీవ్రమైన క్రష్ ఇంజరీలు, విస్తృతమైన సాఫ్ట్ టిష్యూ నష్టం కారణంగా కాలు తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడినప్పటికీ, ఇలిజారోవ్ పద్ధతి, స్కిన్ గ్రాఫ్టింగ్ మరియు దీర్ఘకాలిక పునరావాస చికిత్సల ద్వారా 13 సెంటీమీటర్ల ఎముక పునర్నిర్మాణం చేసి అవయవాలనుకాపాడగలిగినట్లు తెలిపారు. సుమారు 13 నెలల చికిత్స అనంతరం రోగి తిరిగి నడిచే స్థితికి చేరుకున్నట్లు చెప్పారు. అదే విధంగా, తీవ్రమైన వాల్గస్ డిఫార్మిటీ, ఆస్టియోఆర్థ్రైటిస్‌తో బాధపడుతున్న ప్రమీలకు టోటల్ నీ రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్స నిర్వహించి సాధారణ జీవితం అందించినట్లు వివరించారు. రోడ్డు ప్రమాదాలు, దాడుల కారణంగా బహుళ ఫ్రాక్చర్లు, తలకు గాయాలతో చేరిన పలువురు రోగులకు దశలవారీ శస్త్రచికిత్సలు నిర్వహించి పూర్తిగా కోలుకునేలా చేసినట్లు తెలిపారు. ఈ విజయాలు వైద్యులు, అనస్థీషియా నిపుణులు, నర్సింగ్ సిబ్బంది, ఫిజియోథెరపిస్టులు మరియు ఇతర సిబ్బంది సమిష్టి కృషి ఫలితమని డాక్టర్ లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా అత్యాధునిక వైద్య సాంకేతికతతో ప్రజలకు నాణ్యమైన, అందుబాటు వైద్య సేవలు అందించేందుకు కృషి కొనసాగిస్తామని తెలిపారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాల లేక వేలాది మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు

- **ఎస్ఎఫ్ఐ మొయినాబాద్ మండల కార్యదర్శి చరణ్ గౌడ్**



**మొయినాబాద్, మే 30 (నగర నిజం):** మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు జూన్ 1వ తేదీ నుంచి తెలంగాణ రాష్ట్రంలో ఇంటర్మీడియట్ తరగతులు ప్రారంభం కానున్నాయి. అయితే మొయినాబాద్ మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు ప్రైవేట్ కళాశాలల వైపు మొగ్గు చూపాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రైవేట్ కళాశాలలు అధిక ఫీజులు వసూలు చేయడంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు చదువును కొనసాగించలేక డ్రాప్అవుట్ అయ్యే ప్రమాదం ఉంది. అంతేకాకుండా విద్యార్థులు విద్య కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుండటంతో సమయం, డబ్బు వృథా అవుతున్నాయి. మొయినాబాద్ మండలంలో వెంటనే ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేసి విద్యార్థుల విద్యా హక్కును కాపాడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తోంది. ప్రభుత్వం తక్షణమే స్పందించి కళాశాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి. లేకపోతే భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఎస్ఎఫ్ఐ మొయినాబాద్ మండల కార్యదర్శి చరణ్ గౌడ్ హెచ్చరించారు.

## బ్లాస్ట్‌లో వ్యక్తి మృతి

**ముత్తంగిలోని టైర్ రిట్రేడింగ్ వర్క్‌షాప్‌లో ఘటన**

- **మరొకరికి తీవ్ర గాయాలు**



**నగర నిజం మే 30** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముత్తంగి ప్రాంతంలో ఉన్న ఓ టైర్ రిట్రేడింగ్ వర్క్‌షాప్‌లో జరిగిన డై బ్లాస్ట్ ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యారు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడగా, అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ముత్తంగిలోని టైర్ రిట్రేడింగ్ వర్క్‌షాప్‌లో పని జరుగుతున్న సమయంలో ఆకస్మికంగా డై బ్లాస్ట్ సంభవించింది. ఈ సమయంలో వర్క్‌షాప్‌ను సందర్శించేందుకు వచ్చిన హైదర్‌నగర్‌కు చెందిన సలీం బ్లాస్ట్ తీవ్రతకు గురై అక్కడికక్కడే మృతి చెందారు. ఘటన సమయంలో వర్క్‌షాప్‌లో ముగ్గురు వ్యక్తులు ఉన్నట్లు సమాచారం. ప్రమాదంలో సలీం మృతి చెందగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని వెంటనే సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న పటాన్‌చెరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. డై బ్లాస్ట్‌కు దారితీసిన పరిస్థితులపై సాంకేతిక నిపుణుల సహాయంతో విచారణ కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## యువత క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలి



- **పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి..**
- **భానూరులో ఘనంగా ప్రారంభమైన పి పి ఆర్ వాలీబాల్ టోర్నమెంట్..**

**నగర నిజం మే 30** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నేటి తరం యువత క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి సూచించారు. పటాన్చెరు మండలం భానురు గ్రామంలో ఏర్పాటు చేసిన పి పి ఆర్ వాలీబాల్ టోర్నమెంట్ ను శనివారం ఉదయం ఎమ్మెల్యే జిఎంఆర్ లాంచనగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసానికి కూడా దోహదపడతాయని తెలిపారు. నేటి ఆధునిక జీవనశైలిలో యువత ఎక్కువ సమయం మొబైల్ ఫోన్లు, సామాజిక మాధ్యమాలకే పరిమితం కాకుండా క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనాన్ని అలవర్చుకోవాలని సూచించారు. క్రీడా స్ఫూర్తి యువతలో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జట్టు భావనను పెంపొందిస్తుందని పేర్కొన్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా క్రీడ మైదానాలు ఏర్పాటు చేయడంతో పాటు వివిధ అంశాల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తూ క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు. క్రీడా సదుపాయాలను సద్వినియోగం చేసుకొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా కృషి చేయాలని కోరారు. ప్రతి విద్యార్థి తన రోజువారీ జీవితంలో కొంత సమయాన్ని క్రీడలకు కేటాయించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కృష్ణ యాదవ్, శ్యాంసుందర్ రెడ్డి, క్రీడాకారులు, క్రీడా పోటీల నిర్వాహకులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ కె. లలితాదేవి బాధ్యతల స్వీకరణ



**నగర నిజం సంగారెడ్డి, మే 30:** చార్మినార్ జోన్ డీఎంహెచ్‌వోగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ కె. లలితాదేవి శనివారం సంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా (డీఎంహెచ్‌వో) బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆమె జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు అందుకున్నారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ప్రోగ్రామ్ అధికారులతో సమావేశమై జిల్లాలో అమలవుతున్న ఆరోగ్య కార్యక్రమాలు, అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లలితాదేవి మాట్లాడుతూ, జిల్లాలో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రతి ఉద్యోగి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. సమయపాలన పాటిస్తూ, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించి జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు మంచి పేరు తీసుకురావాలని సిబ్బందికి పిలుపునిచ్చారు. జిల్లా అభివృద్ధి, ప్రజారోగ్య పరిరక్షణలో అందరూ సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ లక్ష్యాలను విజయవంతం చేయాలని ఆమె పేర్కొన్నారు.

## అంజిబాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా డాక్టర్ గుమ్మడి కిరణ్ జన్మదిన వేడుకలు

- **శుభాకాంక్షలు తెలిపిన స్నేహితులు, స్థానికులు.**






**కూకట్పల్లి మే 30,(నగర నిజం ప్రతినిధి) :** కూకట్పల్లి నియోజకవర్గం బాలాజీ నగర్ లోని గుమ్మడి రాజలింగం ఫౌండేషన్, శ్రేష్ట ఐ క్లినిక్ అధినేత డాక్టర్ గుమ్మడి కిరణ్ జన్మదిన వేడుకలు అంజిబాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. శ్రేష్ట ఐ క్లినిక్ లో జరిగిన వేడుకలో మిత్రుల సమక్షంలో కిరణ్ కేక్ కట్ చేశారు. మిత్రులు, స్థానికులు డాక్టర్ కిరణ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించ్చారు. ఈ వేడుకలో అంజిబాబు ఫౌండేషన్ ఫౌండర్ & సీఈవో నాగుల ఆంజనేయులు (అంజిబాబు), ఏబీఎన్ ఆంధ్రజ్యోతి సీనియర్ జర్నలిస్ట్ ఎస్. కళ్యాణ్, హైకోర్టు అడ్వకేట్, కవి, రచయిత కొండూరి కోటిబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిధులకు డాక్టర్ కిరణ్ జ్ఞాపికలు అందచేశారు. తనకు శుభాకాంక్షలు తెలియజేసిన మిత్రులు, స్థానికులకు డాక్టర్ కిరణ్ హృదయపూర్వక ధన్యవాదములు తెలిపారు.

# మేం అధికారంలోకి వచ్చాక 111 జీవో ఎత్తివేస్తాం





- **గుంపు మేస్త్రీ పై పోరాటానికి ప్రజలంతా సిద్ధం కావాలి**
- **టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత**

**మొయినాబాద్, మే 30(నగర నిజం):** తమ పార్టీ అధికారంలోకి రాగానే 111 జీవో ఎత్తివేస్తామని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత చెప్పారు. ఈ జీవో కారణంగా బాధపడుతున్న వారందరికీ ఉపశమనం కలిగిస్తామన్నారు. టీఆర్ఎస్ జెండా పండుగ కార్యక్రమంలో భాగంగా శనివారం మొయినాబాద్ లో ఏర్పాటు చేసిన జెండా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మొయినాబాద్ లో అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళు లర్పించిన...అనంతరం పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ లక్ష్యాల కోసం తెలంగాణ సాధించుకున్నామో ఆ లక్ష్యాలను గత 12 ఏళ్లలో సాధించుకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ హక్కులను పరిరక్షించుకునేందుకే టీఆర్ఎస్ ఏర్పాటు చేశామన్నారు. 111 జీవో పరిధిలోని బాధితులందరికీ టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత గుడ్ న్యూస్ చెప్పారు. తమ పార్టీ అధికారంలోకి రాగానే ఈ జీవో ను ఎత్తివేస్తామన్నారు. ఇతర పార్టీల మాదిరిగా తాము మోసం చేయమని స్పష్టం చేశారు. గతంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ లు ఇక్కడి ప్రజలకు 111 జీవో ఎత్తేస్తామంటూ మాట ఇచ్చి అధికారంలోకి వచ్చాక మోసం చేశాయని విమర్శించారు. 111 జీవో పరిధిలో ఉన్న 120 గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. చుట్టు పక్కల భూములు ఎకరాకు వంద కోట్లకు పైగా ధర పలుకుతుంటే 111 జీవో పరిధిలోని ప్రజలు మాత్రం తమ భూములను ఎక్కువ రేటుకు అమ్ముకోలేని పరిస్థితి ఉందన్నారు. పిల్లల పెళ్లిళ్ల కోసం ఒక పావు ఎకరం భూమి అమ్మితే సమస్యలు తీరుతాయని భావించినప్పటికీ ఈ జీవో అడ్డంకిగా ఉందన్నారు. గుంపు మేస్త్రీ తనకు రియల్ ఎస్టేట్ వ్యాపారం ఒక్కటే తెలుసని చెప్పి అధికారంలోకి వచ్చాక ఆ వ్యాపారాన్ని ఊడగొట్టారని మండిపడ్డారు. చేవెళ్ల, మొయినాబాద్ లో ఎక్కువగా రైతులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఉంటారని వారికి మేలు చేసేలా ఈ ప్రభుత్వం ఏమీ చేయటం లేదని మండిపడ్డారు. అందుకే గుంపుమేస్త్రీ పై పోరాటానికి ఈ ప్రాంత ప్రజలంతా ముందుకు రావాలని కోరారు. తెలంగాణ వచ్చాక అన్ని సమస్యలు తీరుతాయని భావిస్తే అలా జరగలేదని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఏ లక్ష్యాల కోసం రాష్ట్రం సాధించుకున్నామో ఆ లక్ష్యాలతో పాటు తెలంగాణ హక్కుల పరిరక్షణ కోసమే తాము కొత్త రాజకీయ శక్తిగా పుట్టుకొచ్చామన్నారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత ఆడబిడ్డల జీవితాల్లో ఎలాంటి మార్పు రాలేదని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఒక ఆడబిడ్డగా, మీ సోదరిగా మీకు ఏం కావాలో నాకు తెలుసు. తప్పకుండా మన పార్టీ ద్వారా మహిళలకు మంచి జరుగుతుందని హామీ ఇస్తున్నా అన్నారు. అదే విధంగా యువత కోసం ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. సృజనాత్మక ఆలోచన కలిగిన యువత వ్యాపారం చేసేలా ప్రోత్సహించేందుకు వారికి ఎలాంటి గ్యారంటీ లేకుండా 2 లక్షల నుంచి 20 కోట్ల వరకు రుణాలు మంజూరు చేస్తామన్నారు. చేవెళ్ల, మొయినాబాద్ నుంచి మైనార్టీలు పెద్ద ఎత్తున చేరటంతో ఈ ప్రాంతంలో పార్టీ మరింత బలపడిందని చెప్పారు. ఇక్కడి గంగా జమున తెహజీబ్ ను చెడగొట్టే ప్రయత్నం చేస్తున్న వాళ్లకు బుద్ధి చెప్పాల్సిన అవసరముందని కవిత అన్నారు. అంతకుముందు కవిత చిలుకూరు బాలాజీ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజాలు చేశారు. కొత్తగా ఏర్పాటు చేసిన తమ పార్టీకి స్వామి వారి ఆశీస్సుల కోసం వచ్చామని చెప్పారు. బాలాజీ ఆశీస్సులతో తెలంగాణ ప్రజల కోసం పోరాటం చేస్తామన్నారు. రాష్ట్రంలో తీవ్రంగా ఇబ్బంది పడుతున్న రైతులకు మంచి చేసే బుద్ధి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇవ్వాలని స్వామి వారిని కోరుకున్నానని కవిత చెప్పారు. జెండా పండుగ కార్యక్రమం అనంతరం మొయినాబాద్ మండలం సొరంగల్ లో టీఆర్ఎస్ నాయకుడు సంతోష్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న బస్ షెల్టర్ కు శంకుస్థాపన చేశారు.

Edited & printed and owner,publisher Yela purushotham,(Regd): H-No 11-21-890,Ntr Nagar,L.B nagar saroor nagar mandal,Rangareddy-Dist,500074, printed Y.p.s publication H-No 11-21-890,Ntr Nagar,L.B nagar, saroor nagar mandal,Rangareddy-Dist,TELANGANA-500074, Editor Yela purushotham.(H.O) : plot no:31,H-No 1-13,kuntloor road,Near hayathanagar,abdullapur mettu mandal,rangareddy dist,TELANGANA-501505,
RNI NO: APTEL/2013/54450.(PRGI) .PH NO:8247467562 Email; nagaranijam@gmail.com.Whatsapp no : 8247467562,WEBSITE: WWW.NAGARANIJAM.COM.TELANGANA STATE

